నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ ప్రదీప్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లోని బ్లాకులు ఏ1 నుండి ఏ6 వరకు, ఏ12 నుండి ఏ21 వరకు, ఏ36 నుండి ఏ50 వరకు, సీ4 నుండి సీ10 వరకు, పల్లవి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్,అత్వెల్లి పరిధిలో..

మేడ్చల్: మేడ్చల్,అత్వెల్లి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు రాంబాబు, మౌలాలి తెలిపారు. మేడ్చల్ లోని కేఎల్ఆర్ వెంచర్, కింది బస్తీ, మెయిన్‌రోడ్, వినాయక్‌నగర్, టీచర్స్ కాలనీ, స్టేషన్‌రోడ్డు, కంట్రీ క్లబ్, ఎన్జిఓస్ కాలనీ, టీచర్స్‌కాలనీ, సరస్వతీనగర్, బాలాజీనగర్, జ్యోతి నగర్,అత్వెల్లి, ఎల్లంపేట్ లలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత




కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సత్తమ్మ మంజూరైన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సత్తమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్, నేతలు నిమ్మల శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీధర్, ఎల్లమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం



కీసర: యాద్గార్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థుల సౌకర్యార్థం అమ్మ ఆదర్శ పాఠశాల, ఎంపీటీసీ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్కపావుల ప్రేమలత ,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చీర యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



ఘట్‌కేసర్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఎదులాబాద్‌లోని శ్రీ గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి మంగళ హారతులతో స్వాగతం పలికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించారు. 24వ తిరుప్పావై సామూహికంగా పఠించారు. అనంతరం ఆలయ పూజారులు తిరుప్పావై అర్థం భక్తులకు వివరించారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం



కీసర: కీసరలో విద్యుత్ హైఓల్టేజీ కారణంగా పలు ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సిద్దార్థ కాలనీకి చెందిన రామిడి స్వరూప బుధవారం ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి నగరానికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇంట్లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. లోపలికి వెళ్లి చూడగా టీవీతో పాటు సోఫా, సీలింగ్ ఫ్యాన్ మంచంతో పాటు పలు గృహోపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పక్కనే ఉన్న మరో మూడు ఇళ్లల్లో సైతం గృహోపకరణాలు కాలిపోయాయి. కాలనీలో గత కొన్ని రోజులుగా కరెంటు హెచ్చుతగ్గుల వల్ల ఇబ్బంది పడుతున్నామని సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

మల్కాజిగిరి ఎంపీ ,
దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ బలహీనవర్గాల ప్రజలకు చేయూత నందించడంతో పాటు, జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా సమస్యలపై చర్చించడానికి కాకుండా పరిష్కరించడానికి సమావేశాలు దోహదపడాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రిరాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, అరికెపూడి గాంధి, మెంబరు సెక్రటరీ జిల్లా కలెక్టరు గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శాఖల వారీగా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును, పురోగతిపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు సత్ఫలితాలు చేకూరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీపీ పీడీ సాంబశివరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రశాంత్, పంచాయతీ రాజ్ ఈఈ వేణుగోపాల్, సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత తదితరులు పథకాల పురోగతిపై నివేదికలను ప్రవేశపెట్టారు.

డీఆర్‌సీ సమావేశాలు మళ్లీ నిర్వహించాలి

రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే ,రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో (దిశ) సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైల్వేల అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటే రెట్టింపులో ఈ పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు సంబంధించి గతంలో రైల్వే పనులకు మాత్రమే కేంద్రం నిధులు విడుదలయ్యేవని, మోదీ ప్రభుత్వం హయాంలో 100 శాతం నిధులు అందజేస్తుందన్నారు. చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.410 కోట్లతో అద్భుతంగా నిర్మించిందన్నారు. తెలంగాణలో 45 రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే రూ.2 వేల కోట్లతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశ సంపద గణనీయంగా పెరిగిందన్నారు. రూ.4 లక్షల కోట్లతో యువతకు ఉపాధి కల్పన ,ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. దిశ సమావేశాలతో ప్రజా సమస్యలు చర్చకు రావటంతోపాటు పరిష్కారమవుతాయన్నారు. అందుకే మళ్లీ డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ నేతలు పటోళ్ల విక్రంరెడ్డి .చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'దిశ'లో ఎవరు ఎమన్నారంటే..



'దిశ' సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ)సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దిశ చైర్మన్ ,ఎంపీ ఈటల రాజేందర్, మెంబర్ సెక్రటరీ ,కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు . వారు ప్రస్తావించిన విషయాలు వారి మాటల్లోనే.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

చీర్యాల తుర్కపల్లి, కీసరల్లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి. వీధి వ్యాపారులకు బ్యాంకులు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

- సీహెచ్ .మల్లారెడ్డి మేడ్చల్ ఎమ్మెల్యే

దోమల బెడదను నివారించాలి

మల్కాజిగిరిలో డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. మచ్చ బొల్లారం డంపింగ్ యార్డును చక్కదిద్దాలి. దోమల బెడదనుంచి మల్కాజిగిరిని కాపాడాలి. డిగ్రీ కాలేజీ నిర్మాణానికి రూసా నిధులు సిద్ధంగా ఉన్నా.. స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. 'దిశ'లో 2 ఎకరాలు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించటం ఆనందంగా ఉంది. నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించాలి. మౌలాలి పారిశ్రామికవాడ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి.అల్వాల్ పీహెచ్‌సీని ప్రారంభించాలి.

- మర్రి రాజశేఖర్‌రెడ్డి,
మల్కాజిగిరి ఎమ్మెల్యే

వైద్యుల నియామకం చేపట్టాలి

ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలి. టీచర్ పోస్టులను భర్తీ చేసి, ప్రభుత్వ స్కూళ్లకు భవనాలు నిర్మించాలి. డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించి ,భవనం నిర్మించాలి. మన బడి కింద ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనులకు బిల్లులు అందజేయాలి.

- బండారి లక్ష్మారెడ్డి ,ఉప్పల్ ఎమ్మెల్యే

ఆసుపత్రికి స్థలం కేటాయించాలి

ఆసుపత్రి ,గ్రంథాలయం, విద్యాసంస్థలకు సర్వేనంబర్ 330లోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలి. ప్రభుత్వ భూములను కాపాడాలి.3 నెలలకు ఒకసారి ఖచ్చితంగా దిశ సమావేశం నిర్వహిస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి.

- ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ ,
శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

◆ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరటంతోపాటు ఆసుపత్రులు, ప్రభుత్వ బడుల అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని కోరారు, సభ్యుడు విక్రంరెడ్డి కండ్లకోయ రైల్వే బ్రిడ్జి సమస్యను పరిష్కారించాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీత స్థానిక ప్రభుత్వ పాఠశాలకు స్థలం కేటాయిస్తే... భవన నిర్మాణం చేపట్టేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రైతు సేవా సహకార సంఘం నూతన భవనం ప్రారంభం



రైతు సేవా సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో రూ. 1.5 కోట్లతో నిర్మించిన రైతు సేవా సహకార సంఘం నూతన భవనాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం రైతులు ఆస్తి అన్నారు. ఈ సంఘంలో రైతులకు తక్కువ వడ్డీతో రుణం లభిస్తుందని, ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి, సంఘం డైరెక్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

పరిశోధనలకు నిధులు మంజూరు

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆవిష్కరణలే లక్ష్యంగా కృషి చేస్తున్న కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్(సెర్బ్) నుంచి గ్రాంట్‌గా రూ.42.7 లక్షల గ్రాంట్ లభించింది. ఈ విషయాన్ని కాలేజీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ(డీబీటీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)ల మద్దతుతో న్యూరో ఫార్మకాలజీలో పరిశోధన ప్రాజెక్టులకు సంబంధించి తమ కళాశాల గణనీయమైన పురోగతి సాధిస్తోందని, ఇదేవిధంగా ఐసీఎంఆర్ నుంచి రూ.58.67 లక్షలు గ్రాంట్ అందుకున్నామన్నారు.

దివ్యానగర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన



నల్ల మల్లారెడ్డితో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పోచారం: కాచవానిసింగారంలోని దివ్యానగర్‌లో అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమిత ప్రదేశాలను హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ బుధవారం పరిశీలించారు. దివ్యానగర్ గేటెడ్ కమ్యూనిటీ కానందున గేట్లు, రహదారులపై గోడలు ఎందుకు ఏర్పాటు చేశారని నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాల్లో నర్సింగ్ హోం వంటి ఎలా నిర్మాణాలు వచ్చాయని, వీటిని ఎవరు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. గేట్లు, గోడలు లేకుంటే భద్రతా సమస్యలు వస్తాయని కాలనీవాసులు చెప్పారు. అందుకు రంగనాథ్ స్పందిస్తూ.. ఎవరి వెంచర్‌కు వారు ప్రహరీలు నిర్మించుకుంటే ఒక వెంచర్ నుంచి మరో వెంచర్‌లోకి వెళ్లాలంటే హెలికాప్టర్ వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఏది ఏమైనా నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి తర్వాత అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. దివ్యానగర్ వెంచర్ చేసిన నల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ.. వెంచర్ ఏర్పాటులో నిబంధనలు అతిక్రమించలేదన్నారు. ఘట్‌కేసర్ తహశీల్దార్ డీ.ఎస్.రజిని, ఆర్ఐ కావ్యారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశపాలన

కీసర: రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని బీజేపీ నేతలు అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడికి నిరసనగా బుధవారం నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి చౌరస్తా వద్ద నాగారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మునిగంటి సురేష్, లక్ష్మీ వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ నిరంకుశ పాలన కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి , నేతలకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీల కార్యాలయాలపై, నేతల పై దాడులను మానుకోవాలని లేకుంటే తగిన విధంగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మామిడి జంగారెడ్డి, నాగరాజుయాదవ్, అరవింద్‌రెడ్డి, మహేందర్, నక్కకిషోర్‌గౌడ్ సూర్యశేఖరరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, కర్ర వెంకటేశ్వర్, కౌకుట్ల రాహుల్‌రెడ్డి, జూపల్లినరేష్, మాధవరావు, బానుచందర్, ప్రసాద్, కొండల్‌రెడ్డి, కుమార్‌యాదవ్, రమణాచారి, శైలజ, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



రాంపల్లిచౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

చీర్యాల దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ్మా స్వామి దేవస్థానంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి విశేషపూజలను నిర్వహించడంతో పాటు, భక్తులకు స్వామివారిని సప్తద్వారాల ద్వారా దర్శించుకునేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం స్వామివారు(ఉత్సవమూర్తి) వైకుంఠ ద్వారాల నుంచి దేవాలయంలోకి ప్రవేశిస్తారన్నారు. స్వామి వారికి తులసి పూజ, లక్ష పుష్పార్చన, సప్తహారతులు, ఉదయం 7 గంటలకు సుదర్శన నృసింహ హోమం, భక్తులకు ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం



ఏర్పాటు చేసిన క్యూలైన్లు

శ్రీ గిరి వేంకటేశ్వర ఆలయంలో..



పోచారం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే సుమారు రూ. 15 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా వేడుకల్లో భాగంగా గురువారం మూల విరాట్‌కు పంచామృత అభిషేకం జరుగుతుందన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం, ఉత్తర ద్వార దర్శనం, అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం, శనివారం కుడారై ఉత్సవం, సోమవారం గోదా రంగనాయక స్వామి కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులోనే ప్రమాదాలు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్: వాహనదారులు మద్యం సేవించి, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేయడం వల్లే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ హనుమాన్‌గౌడతో కలిసి మేడ్చల్ ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ వార్షిక నివేదిక వెల్లడించారు. 2023లో 108 ప్రమాదాలు జరగ్గా 2024లో 113 ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటిలో అధికంగా మద్యం సేవించి వాహనాలు నడపడం,, రాంగ్‌రూట్ కారణంగా చోటు చేసుకున్నాయన్నారు. గత సంవత్సరంలో ట్రాఫిక్ పోలీసులు మెరుగైన సేవలు అందించారని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



హాజరైన విద్యార్థులు

మేడ్చల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిపించారు. ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల సెక్రటరీ టివిరెడ్డి ,ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనం రాజేష్, సరోజరెడ్డి. అనురాగ్‌రెడ్డి, రవి,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ

పోచారం: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఏ గ్రేడ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ 2025 కేలండర్, డైరీని బుధవారం అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ.సీ.రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, టెండర్ విధానంలో ఉన్న లోటుపాట్లను సవరించాలని పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు ఈ అంశాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన లైసెన్సింగ్ విధానాన్ని ప్రతి కాంట్రాక్టర్ అవలంభించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలూరి మహేందర్, ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి కనకాచారి, ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం డీసీపీ ఎస్‌వీ నాగలక్ష్మి
- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీసీపీ ఎస్‌వీ నాగలక్ష్మి

జవహర్‌నగర్: సామాజిక మాధ్యమాన్ని దుర్వినియోగం చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని , విద్యార్థులు సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ సైట్‌లపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ ఎస్‌వీ నాగలక్ష్మి అన్నారు. బుధవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవినాష్ డిగ్రీ కళాశాలలో జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో ' సైబర్ నేరాలు' అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబర్ క్రైం డీసీపీ నాగలక్ష్మి మాట్లాడుతూ సాంకేతికత ఎంత అభివృద్ధి చెందుతుంటే అదే స్థాయిలో సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయన్నారు. అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపుతూ ఎంతో మందిని మోసం చేస్తున్నారని వారి వలలో పడొద్దని సూచించారు. ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులు, సామాన్య ప్రజలు మోసపోయారని ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ శివశంకర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు లక్ష్మయ్య, నరేష్, జవహర్‌నగర్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలపై ఎల్‌ఈడీ ప్రదర్శన

జవహర్‌నగర్: సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య అన్నారు. బాలబాలికలపై జరుగుతున్న నేరాలపై షీటీం ఆధ్వర్యంలో బుధవారం మొబైల్ వ్యాన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొబైల్ వ్యాన్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్ నిరోధక చట్టం, బాల్యవివాహాలు, సైబర్ క్రైం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సీసీ కెమరాలు, లోన్‌యాప్‌లు, కేస్ స్టడీలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 100కి డయల్ చేయాలని, లేదా షీ టీమ్ కుషాయిగూడ డివిజన్ నెం. 8712662601, రాచకొండ వాట్సప్ నెం. 8712662111 లకు ఫోన్ లేదా చాటింగ్‌ల ద్వారా సమాచారాన్ని అందించాలని సూచించారు. సైబర్‌క్రైమ్ కోసం హెల్ప్‌లైన్ నంబర్ 1930లకు ఫోన్ చేయాలని కోరారు.



ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదయ్య